క్లుప్తంగా

లారీ, కారు ఢీ.. ఇద్దరికి గాయాలు

ఏటూరునాగారం : మండలంలోని చిన్నబోయినపల్లి, తాడ్వాయి గ్రామాల మధ్య 163 జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం లారీ, కారు ఢీకొనగా కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న నందకిషోర్, రాంబాబుకు గాయాలు కాగా వీరిది పెద్దపల్లి గ్రామానికి చెందినట్లుగా గుర్తించారు. క్షతగాత్రులను ములుగు ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

మట్టి గణపతిని పూజిద్దాం



ఎంఈఓకు మట్టివిగ్రహాలను అందజేస్తున్న విద్యార్థినులు

వాజేడు : మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ కస్తూర్బాగాంధీ విద్యాలయం విద్యార్థినులు సోమవారం ప్రచారం చేశారు. వారు తయారు చేసిన మట్టి విగ్రహాలను తీసుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మట్టి విగ్రహాలతో పూజలు చేయడం మూలంగా భూమి, ప్రకృతి, జలం బాగుంటాయని, దీంతో ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారన్నారు.

కేశవరావు సేవలు అభినందనీయం

ఎస్ఎస్‌తాడ్వాయి : పీజీ హెచ్ఎంగా, మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా కేశవరావు విద్యాఅభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ భవనంలో బూర రజిత అధ్యక్షతన రేగ కేశవరావు సన్మాన సభ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు రాజు, సాంబయ్య, మల్లారెడ్డి, ఏటీడీఏ క్షేత్రయ్య, ఎంపీడీఓ సుమనవాణి, ఉపాధ్యాయులు హాజరై కేశవరావు దంపతులను పూలమాలతో సత్కరించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంపీఓ శ్రీధర్‌రావు, నార్లాపూర్ కాంప్లెక్స్ పీజీ హెచ్ఎం విద్యాసాగర్ పాల్గొన్నారు.

నిబంధనలు లేకుండా యూరియా అందించాలి


ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వెంకటాపురం(కె): నిబంధనలు లేకుండా రైతులకు యూరియా అందించాని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు అన్నారు. సోమవారం రైతులకు సకాలంలో యూరియా అందించాలని కోరుతూ బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు ఒకటి, రెండు బస్తాలు అని కాకుండా సరిపడా అందించాలని అన్నారు. బ్లాక్ మార్కెట్ లో రూ.250 బస్తాను రూ.300లకు ఇతర రాష్ట్రాలకు ఛత్తీస్‌గఢ్‌కు బ్లాక్‌లో తరలిస్తున్నారని ఆరోపించారు. ఇతరరాష్ట్రాలకు బ్లాక్ మార్కెట్ తరలకుండా అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దర్రా దామోదర్, వేల్పూరి లక్ష్మీనారాయణ, ముదుంబా శ్రీనివాస్, జాగర శివాజీ, నామన సాయి, పెనుమత్స మాధురి, పర్శిక పగిడిద్ద రాజు తదితరులు పాల్గొన్నారు.

డిప్యుటేషన్‌పై ఎంఈఓ ఇష్టారాజ్యం

మంగపేట : మండలంలో ఉపాధ్యాయుల డిప్యుటేషన్ల విషయంలో ఎంఈఓ పొదెం మేనక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని యూటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి గద్దం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వం 2025–26 విద్యా సంవత్సరానికి జూన్‌లో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అనుగుణంగా డిప్యుటేషన్ జీవోను విడుదల చేసిందని ఆయన పేర్కొన్నారు. దీంతో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశంలో సెలక్షన్ లిస్టును డీఈఓ కార్యాలయానికి పంపించినట్లు ఆయన తెలిపారు. జాబితా పంపి 30 రోజులు గడుస్తున్నా రేగులగూడెం ఎంపీపీఎస్‌లో 36 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడితో విద్యా బోధన చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఎంఈఓ తన స్వార్థపూరితంగా తన ఇష్టానుసారంగా నిర్ణయం తీసుకుని కొందరు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపించి, మరికొందరిని పంపించక పోవడంపై ఆయన ఆగ్రహం వెలిబుచ్చారు. ఎంఈఓ వైఖరితో విద్యార్థుల విద్య కుంటుపడుతుందన్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి మండలంలోని ఏకోపాధ్యాయ పాఠశాలలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

అనుమతి తప్పనిసరి

- వినాయక మండపాల అనుమతులకు ఆన్‌లైన్ చేయాల్సిందే..
- వివరాల నమోదుకు పోలీస్ శాఖ ప్రత్యేక పోర్టల్
- నిర్వాహకుల సమాచారం, మండపం వివరాలు నమోదు
- రేపటి నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


ములుగులో ఏర్పాటు చేసిన మండపం


మట్టి గణపతిని తయారు చేస్తున్న చిన్నారి


మంగపేటలో అమ్మకానికి సిద్ధంగా మట్టి విగ్రహాలు

వెంకటాపురం(ఎం): పూజలను ప్రారంభించే ముందు వినాయకుడిని పూజించి అనుమతి పొందడం హిందూ సంప్రదాయంలో ముఖ్యమైన ఆచారం. విఘ్నేశ్వరుని అనుమతి పొంది ఏ పని ప్రారంభించిన విజయవంతం అవుతుందని నమ్మకం. అలాంటి విఘ్నేశ్వరుని పూజకు పోలీసుశాఖ అనుమతితో పాటు విద్యుత్, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకోవడం తప్పనిసరిగా మారింది. గణపతి నవరాత్రులను నిర్వహించేవారు తప్పకుండా పోలీసు శాఖ ప్రత్యేక పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేయాలని ఇప్పటికే పోలీసులు గ్రామాల్లో యువకులకు, ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. తాత్కాలిక విద్యుత్ సరఫరాకు మండపాల నిర్వాహకులు విద్యుత్‌శాఖకు డబ్బులు చెల్లించి అనుమతులు తీసుకోవాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని విద్యుత్ అధికారులు సైతం మరోవైపు హెచ్చరిస్తున్నారు. మండపాల వల్ల ప్రజలకు ఆటంకం కలగకుండా ఉండేలా ఏఏ ప్రాంతంలో నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారో తమకు సమాచారం అందించాలని గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ అధికారులు చెబుతున్నారు.

నవరాత్రుల్లో పూజలు, అన్నదానాలు

గణపతి నవరాత్రుల సందర్భంగా ఒక్కొక్క గ్రామ పంచాయతీ పరిధిలో 5 నుంచి 20 వరకు గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 9 మండలాల పరిధిలో 171 గ్రామ పంచాయతీలు, ఒక మున్సిపాలిటీ ఉండగా సుమారు రెండు వేలకు పైగా వినాయక మండపాలను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు సన్నద్ధమవుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గణపతి నవరాత్రులకు ఇప్పటికే విగ్రహాలకు అడ్వాన్స్‌లు చెల్లించి బుక్ చేసుకున్నారు. 9 రోజుల పాటు పూజలు, భజనలు నిర్వహించడమే కాకుండా ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాలు చేసేలా ఉత్సవ కమిటీ సభ్యులు చర్యలు తీసుకుంటున్నారు. అన్నదానాలు చేసేందుకు దాతలు ఇప్పటికే పోటీపడుతూ తమ పేర్లను నిర్వాహకుల వద్ద నమోదు చేసుకుంటున్నారు.

పోర్టల్ ముఖ్య ఉద్దేశం

పోలీస్ శాఖ చేపట్టిన ఆన్‌లైన్ విధానంతో అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొనే అవకాశం ఉంటుంది. దీంతో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేందుకు దోహదపడుతుంది. మండపాల వద్ద మైకులను వాడే పద్ధతిని కూడా కంట్రోల్ చేసేందుకు సులువవుతుంది. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

మట్టి గణపతులను పూజించాలి

ప్రతిఏటా రసాయనాలతో కూడిన వినాయకులను ఏర్పాటు చేయడంతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతుంది. పర్యావరణం, కాలుష్యం పెరగకుండా ప్రతిఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని నిర్వాహకులను పర్యావరణ వేత్తలతోపాటు, పోలీస్, మున్సిపల్ శాఖల అధికారులు సూచిస్తున్నారు. మట్టి వినాయకులను నవరాత్రులు పూజించిన అనంతరం నీటిలో నిమజ్జనం చేస్తే అవి వెంటనే నీటిలో కరిగిపోయి పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించవన్నిమట్టి గణపతి మహా గణపతి' పేరుతో నిర్వాహకులు వైభవంగా నవరాత్రులు నిర్వహించుకోవాని సూచిస్తున్నారు.

ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి



మండపాల నిర్వాహకులు వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. లాగిన్ కాగానే నిర్వాహకుడి పేరు, పూర్తి వివరాలు, ప్రాంతం. అది ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందనే వివరాలను మొదటి కాలమ్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రెండో కాలమ్‌లో వినాయక మండపం వద్ద ఉండే ఐదుగురు సభ్యుల వివరాలు, వినాయక నిమజ్జనం తేదీ, వాటి వివరాలు, రూట్ మ్యాప్ తదితర అంశాలను పొందుపర్చాలి. మూడో కాలమ్‌లో వినాయక మండపం ఏర్పాటుకు స్థానికుల అనుమతి, విద్యుత్ శాఖ అధికారి, సౌండ్ సిస్టం అనుమతులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తే వాటికి సంబంధించిన వివరాలను పొందుపర్చాలి. అన్ని వివరాలను నమోదు చేశాక సబ్మిట్ చేస్తే అప్లికేషన్ పూర్తవుతుంది. అన్ని వివరాలను పరిశీలించాక అనుమతులను జారీ చేస్తారు. – రవీందర్, డీఎస్పీ, ములుగు

అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలింపు

- దర్యాప్తు చేపట్టిన రెవెన్యూ అధికారులు


చిన్నవాగులో ఇసుకను తరలించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ గణేశ్

కన్నాయిగూడెం: మండలంలోని కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా వాగుల నుంచి ఇసుకను తరలిస్తున్న సంఘటన మండలంలోని చింతగూడెంలో చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేపట్టి తరలించిన ట్రాక్టర్లను యజమానులను అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి ఇసుకను తరలింపునకు పాల్పడిన ఘటనలో కొందరు ప్రముఖ రాజకీయ పార్టీ నాయకుల హస్తం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎలాంటి ప్రోద్బలం లేకుండా జరగలేదని మండలంలోని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. రెవెన్యూ అధికారుల వివరాల ప్రకారం.. చింతగూడెం పరిధిలోని చిన్నవాగు నుంచి ఆదివారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో కొందరు వ్యక్తులు ట్రాక్టర్లతో వాగు నుంచి ఇసుకను తరలించినట్లు గుర్తించినట్లు తెలిపారు. ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని వాటిపై ప్రతీ ట్రాక్టర్‌కు రూ. 2 వేల రుసుమును విధించినట్లు తహసీల్దార్ సర్వర్, ఆర్ఐ గణేష్ వెల్లడించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు ఉంటాయని తహసీల్దార్ హెచ్చరించారు.

ముస్తాబవుతున్న మండపాలు



వెంకటాపురం(కె): మండలంలో గణపతి నవరాత్రి వేడుకలకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణేశ్ మండపాలు ముస్తాబవుతున్నా యి. మండలంలోని ఎదిర, సూరవీడు, ఆలు బాక, పాత్రాపురం, వీరభద్రవరం, చొక్కాల వెంకటా పురం, మరికా, బర్లగూడెం గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నవ రాత్రి వేడుకలకు ఉత్సవ కమిటీలు సిద్ధం చేస్తున్నారు. ఉత్సవాలను తిలకించే వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


గోవిందరావుపేట : వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్న వైద్యబృందం

- చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున

మంగపేట : ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున అన్నారు. మండలంలోని చుంచుపల్లి ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర ఆదేశాల మేరకు ఆశ్రమ పాఠశాలలోని 73 మంది వి ద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా, వెంటనే పీహెచ్‌సీకి తీసుకురావాలని ఆశ్రమ పాఠశాల వార్డెన్‌కు సూచించారు. హెచ్‌వీ పద్మ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: మండలంలోని జారుడుబండ గుత్తి కోయగూడెంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గారావు, హెల్త్ అసిస్టెంట్‌లు జంపయ్య, శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండలంలోని మామిడి తోట, జారుడు బండ గుత్తి కోయగూడేల్లో సోమవారం డీఎంహెచ్ఓ గోపాల్‌రావు, వైద్యాధికారి చంద్రకాంత్ ఆదేశాల మేరకు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 35 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

కన్నాయిగూడెం : మండలంలోని రాజన్నపేట ఉప కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం గంగూడెంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ అభినవ్, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ వివిధ రోగాలతో పీడించబడుతున్న రోగులకు ఓపీ చూసి మందులను పంపిణీ చేశారు. అవసరం ఉన్న వారికి రక్త నమూనాలు సేకరించి వారికి రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు


మంగపేట : విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి యమున


కన్నాయిగూడెం : గంగూడెంలో వైద్యపరీక్షలు చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్

విద్యార్థులకు టీషర్టుల పంపిణీ

చిట్యాల: మండలంలోని చల్లగరిగ ప్రాథమిక పాఠశాలలో పని చేసి ఇటీవల పదవి విరమణ పొందిన గోవింద సత్యనారాయణ సోమవారం విద్యార్థులకు రూ.10వేలు విలువ చేసే టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. హె చ్ఎం శ్రీపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారితోషికాల జీఓ రద్దు చేయాలి


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్

ములుగు రూరల్ : ఆశ కార్యకర్తలకు ప్రభుత్వం అందిస్తున్న పారితోషికాల జీఓను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. సో మవారం ఆశాలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. ఆశ కార్యకర్తలకు సకాలంలో వేతనాలు అందించాలని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 18 వేల ఫిక్స్‌డ్ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషన్ ప్రమాదబీమా రూ. 50 లక్షల పెంచాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండబోయిన రవిగౌడ్, నీలాదేవి, మంజుల, శ్రావ్య, కవిత, దేవి, సరిత, సత్యవతి, నాగమణి పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబు


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్ల బాధితులు

గోవిందరావుపేట: మండలంలోని పస్రా లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వాటిని త్వరగా పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో డబుల్ బెడ్ రూం బాధితులు అందరూ కలిసి చిట్టిబాబు ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూంలలోని సమస్యలపై వినతి పత్రాన్ని ఆందజేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ 8 ఏళ్లుగా డబుల్ బెడ్ రూంలలోని ఇళ్లలో కరెంట్ స్తంభాలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో అనేక మార్లు ఎమ్మెల్యే, మంత్రిని, కలెక్టర్లను కలిసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. సమస్యలు పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వేంపల్లి శ్రీను, ముక్క వరలక్ష్మి, నీలవేణి, నరేష్, సారమ్మ, ఫాతిమా, దుర్గమ్మ, శ్రీను, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

- ఐలమ్మ విగ్రహ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు దయాకర్


చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న కమిటీ సభ్యులు

ఏటూరునాగారం: చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని చాకలి ఐలమ్మ విగ్రహ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు పర్వతాల దయాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వై జంక్షన్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహం వద్ద విగ్రహ నిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన రజక సంఘం సభ్యులు పర్వతాల దయాకర్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చింతలపల్లి సుమన్, ప్రధాన కార్యదర్శిగా మడిగల సురేష్, ప్రచార కార్యదర్శులుగా చింతలపల్లి విక్రం, శంకరపు కోటేశ్వరరావు, ఉప్పాల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ముక్కెర లాలయ్య (పీఎం)తో పాటు కార్యవర్గ సభ్యులను, గౌరవ సలహాదారులుగా సమ్మయ్య, వెంకటేశ్వర్లు, లాలయ్య, ముక్కెర లాలయ్య (లడ్డు), భిక్షపతి, రాంబాబు, నాగ భూషణంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దయాకర్ మాట్లాడుతూ తన వంతు బాధ్యతగా కార్యక్రమాన్ని తూచా తప్పకుండా నిర్వహిస్తానని తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలోని రజకులు కమిటీ చేసే పనులకు అందరూ పార్టీలకతీతంగా హాజరై విజయవంతం చేయడానికి సహకరించాలని దయాకర్ కోరారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- ములుగు డీఎస్పీ రవీందర్


ములుగు రూరల్ : విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్


వెంకటాపురం(కె) : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ముత్యం రమేశ్


ఏటూరునాగారం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

ములుగు రూరల్ : కళాశాల విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని ములుగు డీఎస్పీ రవీందర్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్లతో సోదరభావం కలిగి ఉండాలని అన్నారు. కళాశాల నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. విద్యార్థులు అనసరమైన విషయాలలో జోక్యం చేసుకొని భవిష్యత్ కోల్పోకూడదని అన్నారు. కళాశాలలో ఫిర్యాదులకు కోసం పోలీష్ శాఖ అధికారుల నెంబర్‌లను ప్రదర్శిస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణ కుమారి, అధ్యాపక బృందం, అలాగే వెంకటాపురం, గోవిందరావుపేట మండలం చల్వాయిలోని కస్తూర్బాగాంధీ జూనియర్ కళాశాలలను వెంకటాపురం, ఏటూరునాగారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పస్రా సీఐలు ముత్యం రమేశ్, ఏటూరునాగారం ఎస్సై రాజ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నవీన్ అధ్యక్షతన నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. గురువులను గౌరవించి వారు చెప్పే పాఠాలను ఏకాగ్రతతో వినాలన్నారు. మెదడుపై ఒత్తిడి పడకుండా యోగా, ధ్యానం చేయాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాసంస్థల యాజమాన్యానికి కళాశాలలో ర్యాగింగ్‌కు ఎ టువంటి చోటు లేకుండా యాంటీ ర్యాగింగ్ కమి టీని ఏర్పాటు చేయాలని అన్నారు. చదువుకునే సమయంలో సీనియర్లు, జూనియర్లు అని ర్యాగింగ్ చేసుకోవద్దని, అలాగే యువత గంజాయి వైపు మొగ్గ చూపరాదని, మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు కొప్పు తిరుపతిరావు, కమలాకర్, యాంటీ ర్యాగింగ్ సెల్ బాధ్యుడు వెంకటయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై అందుబాటులో పనిముట్లు

వాజేడు/కన్నాయిగూడెం : సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని రైతులు దరఖాస్తులను చేసుకోవాలని సోమవారం వాజేడు, కన్నాయిగూడెం వ్యవసాయ అధికారులు మహేశ్‌లు ఒక ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, మహిళా, చిన్న, సన్న కారు(5 ఎకరాల లోపు భూమి ఉన్న) రైతులకు 50 శాతం సబ్సిడీ, పెద్ద కారు రైతులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. బ్యాటరీ పంపులు, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్స్ , రోటావేటర్స్, కల్టివేటర్/ ఎంబి ప్లవ్/ కేజీ వీల్స్, బ్రష్ కట్టర్ అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకోవడానికి అప్లికేషన్ ఫారం, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, ట్రాక్టర్ ఆర్‌సీ జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. లబ్ధిదారులను ఎంపిక చేసిన తర్వాత సంబంధిత పరికరం సరఫరా చేసిన కంపెనీ పేరున డీడీ తీయాల్సి ఉంటుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓలు కోరారు.